నమస్తే తెలంగాణ
జనగామ
5 | వరంగల్, బుధవారం 27 నవంబర్ 2024 | JANAGAON

# ఉద్యమ స్ఫూర్తిని చాటాలి..

**- జనగామ జిల్లా ఇన్‌చార్జి భిక్షమయ్యగౌడ్**

జనగామ, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ) : గులాబీ సైనికులు ఉద్యమ స్ఫూర్తిని చాటి ఈ నెల 29న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని జనగామ జిల్లా ఇన్‌చార్జి బూడిద భిక్షమయ్య గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం జనగామ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల పార్టీ ముఖ్య నాయకులతో వేర్వేరుగా ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాణాలను లెక్కచేయకుండా సాధించుకున్న తెలంగాణ ప్రజలను మాయమాటలతో నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రతీ కార్యకర్త క్షేత్రస్థాయిలో ఎండగట్టాలన్నారు. కేసీఆర్ త్యాగాన్ని.. సాధించిన విజయాన్ని కూడా పల్లెపల్లెనా ప్రచారం చేయాలన్నారు. శుక్రవారం జనగామ ఆర్టీసీ చౌరస్తా నుంచి యశ్వంతపూర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వరకు నిర్వహించే దీక్షా దివస్ ర్యాలీకి పెద్ద ఎత్తున కార్యకర్తలు, ప్రజలను తరలించాలని భిక్షమయ్యగౌడ్ పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, అన్ని మండలాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

జనగామ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి భిక్షమయ్యగౌడ్, చిత్రంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

జనగామ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జయశంకర్ భూపాలపల్లి బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో పాల్గొన్న ముఖ్య నాయకులు

# దీక్షా దివస్‌ను సక్సెస్ చేద్దాం..

## నవంబర్ 29 చారిత్రాత్మకమైన రోజు

**దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జులు పిలుపునిచ్చారు. ఈమేరకు ఉమ్మడి వరంగల్‌లోని జిల్లాల బీఆర్ఎస్ కార్యాలయాల్లో ముఖ్య నేతలతో మంగళవారం సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఆయాచోట్ల వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ నేత కేసీఆర్ నవంబర్ 29న తలపెట్టిన దీక్షతో యావత్ దేశం కదిలి.. ప్రజల కల సాకారమైందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఆయన చేసిన త్యాగాన్ని, సాధించిన విజయాన్ని, ఉద్యమ చరిత్రను భావితరాలకు తెలియజెప్పాలని పేర్కొన్నారు. 29న దీక్షా దివస్ సందర్భంగా ఉద్యమకారులు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఎక్కడికక్కడ ర్యాలీలు, ఫొటో ఎగ్జిబిషన్లు, ఉద్యమకారులకు సన్మానాలు ఉంటాయని.. వేలాదిగా తరలిరావాలని వారు కోరారు.**

### కేసీఆర్ వల్లే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం

- ఆయన త్యాగాన్ని, సాధించిన విజయాన్ని పల్లెపల్లెనా ప్రచారం చేయాలి
- ఉద్యమ చరిత్రను భావి తరాలకు తెలియజెప్పాలి
- సన్నాహక సమావేశాల్లో జిల్లా ఇన్‌చార్జుల పిలుపు

## కేసీఆర్ త్యాగం మరువలేనిది

**- వరంగల్ ఇన్‌చార్జి ముత్తిరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి**

కరీమాబాద్, నవంబర్ 26 : 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అంటూ తన ప్రాణాలను సైతం లెక్క చేయక ఉద్యమ నాయకుడు కేసీఆర్ రాష్ట్ర సాధనే లక్ష్యంగా 2009 నవంబర్ 29న ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన రోజున బీఆర్ఎస్ చేపట్టిన దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని వరంగల్ ఇన్‌చార్జి ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వరంగల్ ఉర్సు గుట్ట సమీపంలోని నాని గార్డెన్‌లో జిల్లా ముఖ్య నాయకులతో మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన కేసీఆర్ త్యాగం మరువలేనిదన్నారు. స్వరాష్ట్ర సాధన కోసం నాడు కేసీఆర్‌కు మద్దతుగా అన్ని వర్గాలు నిలిచాయని, అప్పటి ఉద్యమ నేపథ్యం, చరిత్ర నేటి తరాలకు వివరించాలన్నారు. స్వరాష్ట్ర సాధనలో వరంగల్ పాత్ర మరువలేనిదని, ఉద్యమంలో జిల్లా ముందున్నదన్నారు. నాడు తెలంగాణ కోసం దీక్ష చేపడితే ప్రస్తుతం రాష్ట్ర ప్రయోజనాల కోసం మళ్లీ దీక్షా దివస్‌లో పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా ముఖ్య నాయకులకు దీక్షా దివస్‌పై వారు దిశా నిర్దేశం చేశారు. మూడు వేల మందితో నాని గార్డెన్‌లోనే దీక్షా దివస్ నిర్వహిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, జిల్లాలోని అన్ని మండలాల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతిరాథోడ్

# తొలి అడుగు దద్దరిల్లాలె..

- రాష్ట్రంలో మరో ఉద్యమానికి పునాది కావాలె..
- వీధి రౌడీలా మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి
- దోచుకునుడు.. దాచుకునుడే అతడి నైజం
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్
- సీఎంకు కొడంగల్‌లో తిరిగే ముఖం లేదు
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ, నవంబర్ 26 : ఈ నెల 29న దీక్షా దివస్ కార్యక్రమంతో బీఆర్ఎస్ వేసే తొలి అడుగు దద్దరిల్లాలని, రాష్ట్రంలో మరో ఉద్యమానికి పునాది కావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. చావు నోట్లో తల పెట్టి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ మళ్లీ రావాలని, ఆయన వస్తేనే తమ బాధలు తీరుతాయని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన దీక్షా దివస్ సన్నాహక సమావేశానికి సత్యవతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హయాంలో భూపాలపల్లి బ్రహ్మాండంగా అభివృద్ధి చెందిందని, కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాతో పాటు వంద పడకల ఆస్పత్రి, మెడికల్ కాలేజీలు ఏర్పాటయ్యాయన్నారు. తెలంగాణను సాధించిన కేసీఆర్‌ను బుల్డోజర్లతో తొక్కిస్తా, పేగులు మెడకు వేసుకొని తిరుగుతా, బీఆర్ఎస్ నాయకులను జైలుకు పంపిస్తా అంటూ వీధి రౌడీలా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నాడని, పదవిని దక్కించుకునేందుకు అధిష్టానం కాళ్లు మొక్కిన చరిత్ర ఆయనదన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పాలనలో ఫెయిల్ అయ్యామని కాంగ్రెస్ నేతలు చెప్పుకుంటుంటే, సీఎం రేవంత్‌రెడ్డి విజయోత్సవ సంబురాలు ఎందుకు చేస్తున్నాడో ప్రజలకు చెప్పాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం చేతకావడం లేదని, మూసీని రూ. 1,50,000 కోట్లతో సుందరీకరిస్తానని దొంగ మాటలు చెబుతున్నాడన్నారు. ప్రజల సొమ్మును దోచుకోవడానికే మూసీ నది అనే కొత్త రాగాన్ని ఎత్తుకున్నాడని ఎద్దేవా చేశారు. దోచుకోవడం, దాచుకోవడమే అతడి నైజమని, ప్రజలకు ఇచ్చేదేమీ లేదన్నారు. తాను అందరిని తొక్కుకుంటూ వచ్చానని గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్‌లోని సీనియర్లు నమ్మడం లేదన్నారు. ఇటీవల ఇంటిగ్రేటెడ్ పాఠశాలను తీసుకొచ్చానని చెప్తున్న స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దాని నిర్మాణానికి తెచ్చిన నిధులెన్నో చూపించాలని డిమాండ్ చేశారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, ఇప్పుడు ఇద్దరున్నప్పటికీ వారు నిధులు తీసుకురావడం లేదని, కనీసం మంత్రుల లాగా ప్రవర్తించడం లేదన్నారు. పదే పదే కేసీఆర్ రావాలంటున్న రేవంత్‌రెడ్డి.. ఆయన బయటకు వస్తే తట్టుకోలేవా? అని సత్యవతి ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, మున్సిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్ధు, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు మేకల సంపత్‌కుమార్, కుంభం క్రాంతి కుమార్ రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నూనె రాజుపటేల్, అర్బన్ యూత్ అధ్యక్షుడు బుర్ర రాజుగౌడ్, మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, మాజీ ఎంపీపీ కల్లెపు రఘుపతి రావు, టీజేఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమంలో ఓరుగల్లుది ప్రత్యేక పాత్ర

**- దాస్యం వినయ్‌భాస్కర్**

నాడు ఉద్యమానికి కేంద్ర బిందువైన ఓరుగల్లు స్వరాష్ట్ర సాధనలో ప్రత్యేక పాత్ర పోషించింది. నాటి ఉద్యమ సహచరుల కృషి మరవలేనిది. దీక్షా దివస్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున హనుమకొండ జిల్లాలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. మలిదశ ఉద్యమానికి మలుపు, స్వరాష్ట్ర సాధన ఉద్యమానికి ఊపిరులూదిన నవంబర్ 29 అని అన్నారు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చు డో' నినాదంతో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఉద్యమనాయకుడు కేసీఆర్ ప్రత్యేక తెలంగాణ సాధనే లక్ష్యంగా పోరాడి స్వరాష్ట్రాన్ని సాధించారు. అమరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాటాలు, తెలంగాణ ప్రజల తెగువ, స్వరాష్ట్ర కాంక్షే స్వరాష్ట్ర ఏర్పాటుకు కారణమైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టిసారించి కార్పొరేట్‌కు దీటుగా ఆసుపత్రులు, విద్యాలయాలను అభివృద్ధి చేశారు.

## రేవంత్‌ది నియంత పాలన

**- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**

రాష్ట్రంలో రేవంత్ నియంత పాలన సాగుతున్నది. ఏక ఛత్రాధిపత్యంలా ఉన్నది. నోరు తెరిస్తే బూతులు మాట్లాడుతున్నాడు. ప్రతిపక్షాలపై నిందలు మోపడమే కాకుండా ప్రజలను పక్కదారి పట్టించేలా రాజకీయం చేస్తున్నాడు. సంక్షేమం, అభివృద్ధిని మరచిన రేవంత్‌రెడ్డి ఒక్క హామీని అమలుచేయలేదు. ఆనాడు వేలాది విద్యార్థులు చనిపోతే బలిదేవత అన్న రేవంత్‌రెడ్డి.. ఈ రోజు తెలంగాణ ఇచ్చింది.. సోనియా అమ్మ అని.. ఆమె కాళ్లు కడిగి నెత్తిన పోసుకోవాలని సిగ్గులేకుండా మాట్లాడుతున్నాడు. 14 ఏళ్లు పోరాటం చేసి తెలంగాణ తెచ్చిన మహనీయుడు కేసీఆర్.

## కేసీఆర్ తెలంగాణకు దిక్సూచి

- హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ వాణీదేవి
- స్వరాష్ట్ర ఉద్యమంలో పోరుగల్లుది ప్రత్యేక పాత్ర
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం

హనుమకొండ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి సురభి వాణీదేవి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, ఒడితల సతీశ్‌కుమార్

హనుమకొండ, నవంబర్ 26 : కేసీఆర్ చేసిన దీక్షతో దేశమంతా కదిలిందని.. తెలంగాణ ఉద్యమంలో నవంబర్ 29వ తేదీ చరిత్రాత్మకమైనదని దీక్షా దివస్ కార్యక్రమ హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ వాణీదేవి పేర్కొన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన దీక్షా దివస్ సన్నాహక సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి దిక్సూచి ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్ అని వాణీదేవి పేర్కొన్నారు. తెలంగాణ చరిత్ర ఎప్పటికీ చెరిగిపోదని, ఉద్యమ చరిత్రను భావితరాలకు అందించాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఎవ్వరి పుణ్యాన ఇచ్చింది కాదని 1200మంది బలిదానాలు, కొట్లాడి, పోరాడి సాధించుకున్నామని గుర్తుచేశారు. స్వరాష్ట్ర సాధనకు బీఆర్ఎస్ చేసిన కృషిని మరోసారి ప్రపంచానికి తెలియజెప్పాలన్నారు. ఉద్యమకారులను, పార్టీ శ్రేణులను కలుపుకొని ఈ నెల 29న నిర్వహించే దీక్షా దివస్‌ను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఆ రోజు ఉదయం 9.30గంటలకు అమరవీరుల జంక్షన్ నుంచి బీఆర్ఎస్ ఆఫీసు వరకు ర్యాలీ ఉంటుందని, ఫొటో ఎగ్జిబిషన్ తర్వాత ఉద్యమకారులను సన్మానించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌బాబు, మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకన్న, మర్రి యాదవరెడ్డి, సంగంరెడ్డి సుందర్ రాజు యాదవ్, లలితా యాదవ్, కార్పొరేటర్లు చెన్నం మధు, ఇండ్ల నాగేశ్వర్‌రావు, వరంగల్ పశ్చిమ నియోజకవర్ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, పార్టీ సీనియర్ నాయకులు మేడిపల్లి శోభన్, నయూమొద్దిన్, జానకీరాములు, పోలపల్లి రామ్మూర్తి, వెంకన్న, రవీందర్‌రావు, చింతల యాదగిరితో పాటు జిల్లాలోని 14 మండలాల నుంచి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## పండుగ వాతావరణంలో నిర్వహించాలి

**- ములుగు జిల్లా ఇన్‌చార్జి సుధీర్‌కుమార్**

ములుగు సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి సుధీర్‌కుమార్, చిత్రంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి

ములుగు రూరల్, నవంబర్ 26 : పండుగ వాతావరణంలో బీఆర్ఎస్ దీక్షా దివస్‌ను నిర్వహించాలని ములుగు జిల్లా ఇన్‌చార్జి, హనుమకొండ మాజీ జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అన్న నినాదంతో చేపట్టిన ఆమరణ దీక్షతో కేసీఆర్ దేశ రాజకీయాలను కదిలించారన్నారు. తెలంగాణ సాధించిన అనంతరం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అటు అభివృద్ధి.. ఇటు సంక్షేమం పరంగా రాష్ట్రాన్ని దేశానికి దిక్సూచిగా మార్చిన మహోన్నత నేత కేసీఆర్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి కావస్తున్నప్పటికీ ప్రజలకిచ్చిన హామీలు ఇప్పటి వరకు అమలుచేయలేదన్నారు. దీక్షా దివస్‌లో భాగంగా ములుగు ప్రభుత్వ దవాఖాన, డీఎల్ఆర్, పార్టీ కార్యాలయం వద్ద మూడు ఎల్ఈడీ స్క్రీన్‌లతో పాటు పార్టీ కార్యాలయం వద్ద ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవిందర్‌నాయక్, మండల పార్టీ అధ్యక్షులు పాలెపు శ్రీనివాస్, గడదాసు సునిల్‌కుమార్, కుడుముల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు చెన్న వినయ్, మైనార్టీ విభాగం మండల అధ్యక్షుడు రాజహుస్సేన్, తాడ్వాయి మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు పోరిక విజయ్‌రామ్‌నాయక్, యువజన విభాగం అధ్యక్షుడు కోగిల మహేశ్, బీసీ సెల్ అధ్యక్షుడు సురేందర్, మాజీ ఎంపీటీసీలు గొర్రె సమ్మయ్య, మాచర్ల ప్రభాకర్, జన్నారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎప్పుడు ఎన్నికలొచ్చినా బీఆర్ఎస్‌దే విజయం

రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలొచ్చినా బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది. కొడంగల్ నియోజకవర్గంలో తిరిగే ముఖం, అక్కడి రైతులను కూర్చోబెట్టి మాట్లాడే దమ్ము, ధైర్యం సీఎం రేవంత్‌రెడ్డికి లేవు. మహబూబాబాద్‌లో జరిగిన మహాధర్నాలో కేటీఆర్ పాల్గొంటే అక్కడి ప్రజలు ఎంతో సంతోషపడ్డరు. కాంగ్రెస్ ప్రభుత్వం వడ్లు కొనకపోవడంతో వరి కోసి నెల రోజులైనా ఎక్కడి ధాన్యం అక్కడే ఉంది. ఈ నెల 29న జిల్లా కేంద్రంలో నిర్వహించే దీక్షా దివస్‌కు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలి. నాటి కేసీఆర్ దీక్ష, ఉద్యమ చరిత్ర, తెలంగాణ సాధించిన తీరును వీడియోల రూపంలో ప్రదర్శించి నేటి యువతకు తెలిసేలా కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. **– గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, భూపాలపల్లి**

# రెండు జడ్పీలు.. మూడు ఎంపీపీలు

- ఎట్టకేలకు జడ్పీల పునర్వవస్థీకరణ
- హనుమకొండ, వరంగల్ జడ్పీలుగా ఏర్పాటు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర సర్కారు

హనుమకొండ, నవంబర్ 26 : ఎట్టకేలకు జడ్పీల పునర్వ్యవస్థీకరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు హనుమకొండ, వరంగల్ జడ్పీలుగా విభజన చేస్తూ, కొత్తపల్లి గోరి, ఇనుగుర్తి, సిరోలు ఎంపీపీలుగా మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇక నుంచి వరంగల్ అర్బన్ జడ్పీ హనుమకొండ, వరంగల్ రూరల్ జడ్పీ వ రంగల్‌గా మారనున్నాయి. ఇప్పటివరకు వరంగల్ రూరల్ జిల్లా పరిషత్‌లో కొనసాగిన పరకాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలు ఇక నుంచి హనుమకొండ జిల్లా పరిషత్‌లో కొనసాగుతాయి. ఈ మార్పు ఈ నెల 21 నుంచే అమలులోకి వస్తుందని జీవోలో పేర్కొన్నారు.

గత ప్రభుత్వం 2021లోనే వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లా జడ్పీలను హనుమకొండ, వరంగల్ జిల్లాల జిల్లా ప్రజా పరిషత్‌లుగా మార్పు చేస్తూ జీవో నంబర్ 74ను జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం 2016లో జరిగిన జిల్లాల పునర్విభజన తర్వాత రెవెన్యూ, గ్రామ పంచాయతీలు ఆయా జిల్లాలోకి మారినప్పటికీ వరంగల్ అర్బన్ జిల్లా ప్రజా పరిషత్, వరంగల్ రూరల్ జిల్లా ప్రజా పరిషత్‌లుగా ఉండడంపై పలు అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో అప్పటి ప్రభుత్వం హనుమకొండ, వరంగల్ జడ్పీలుగా మార్పు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో 2021 ఆగస్టు 12న జీవో నంబర్ 74 జారీ చేసినప్పటికీ జిల్లా ప్రజా పరిషత్‌ల పాలక వర్గం గడువు ముగియకపోవడంతో యథాతథంగా కొనసాగించారు. దీంతో పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నట్లు జిల్లా యంత్రాంగం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. అయితే గత జూన్ 5తో పాలకవర్గం గడువు ముగియడంతో వరంగల్ రూరల్ జిల్లా పరిషత్‌లోని ఆత్మకూరు, దామెర, శాయంపేట, పరకాల, నడికూడ మండలాలను హనుమకొండ జడ్పీలో కలుపుతూ మార్పు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నాలుగు నెలల క్రితం జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలు పంపింది. దీనిని పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు హనుమకొండ, వరంగల్ జడ్పీలుగా మారుస్తూ జీవో నంబర్ 68ను జారీ చేసింది.

**హనుమకొండ జడ్పీ పరిధిలో 12 మండలాలు**

రాష్ట్ర సర్కారు హనుమకొండ జడ్పీ పరిధిలో పరకాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, దామెర, శాయంపేట, పరకాల, నడికూడ ఐదు మండలాలను కలుపుతూ 68జీవో జారీ చేసింది. ఇప్పటివరకు వరంగల్ రూరల్ జడ్పీ పరిధిలో భీమదేవరపల్లి, ధర్మసాగర్, ఎల్కతుర్తి, హసన్‌పర్తి, ఐనవోలు, కమలాపూర్, వేలేరు మండలాలు ఉండగా కొత్తగా పరకాల పరిధిలోని ఐదు మండలాల చేరికతో హనుమకొండ జిల్లా పరిషత్ పరిధి 12 మండలాలకు పెరిగింది. కొత్తగా చేరిన మండలంలోని కార్యకలాపాలు అన్ని ఇక నుంచి హనుమకొండ జిల్లా పరిషత్ నుంచి జరుగనున్నాయి.

**వరంగల్ జడ్పీ పరిధిలో 11 మండలాలు**

వరంగల్ రూరల్ జిల్లా పరిషత్ పరిధిలో ఇప్పటివరకు 16 మండలాలు ఉండగా తాజాగా ప్రభుత్వం జీవో నంబర్ 68ను జారీ చేయడంతో ఆ సంఖ్య 11కు తగ్గింది. ప్రస్తుతం వరంగల్ జడ్పీ పరిధిలో సంగెం, గీసుకొండ, వర్ధన్నపేట, పర్వతగిరి, రాయపర్తి, నర్సంపేట, చెన్నారావుపేట, నల్లబెల్లి, దుగ్గొండి, ఖానాపూర్, నెక్కొండ మండలాలున్నాయి.

**మూడు ఎంపీపీలు**

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో మూడు కొత్త మండల ప్రజాపరిషత్‌లను ఏర్పాటు చేస్తూ జీవో నంబర్ 67ను జారీ చేసింది. వీటిలో జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లాలోని కొత్తపల్లి గోరి (14 జీపీలు), మహబూబాబాద్ జిల్లాలోని ఇనుగుర్తి (14 జీపీలు), సీరోలు (17 జీపీలు)లను కొత్త ఎంపీపీలుగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది.